

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయి, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయి... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**తెలియకుండానే మళ్ళీ రోజులు** గబగబా గడిచిపోయాయి. నేను తిరిగి వెళ్ళే సమయం వచ్చింది.

"క్రిస్మస్‌కి వస్తానులే" నన్ను నేను ఓదార్చుకుంటూ అన్నయ్యకి చెప్పాను.

"ఏ?" అడిగాడు.

"హాలీడేస్ కదా" ఆశ్చర్యపోయాను.

"నీ ఫ్రెండ్స్‌తో ఎక్కడికైనా వెళ్ళచ్చుకదా?"

"ఫ్రెండ్స్‌తోనా?"

"ఔను. నీ ఫ్రెండ్స్ ఇప్పుడు కొలరాడోకి వచ్చినట్టు డిసెంబర్‌లో ఎక్కడికైనా వెళ్ళచ్చు. వాళ్ళతో కలిసి వెళ్ళు. ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళేది ఇప్పుడే."

"సరే"

"నా దగ్గరికి ఎప్పుడైనా రావచ్చు. చదువుకుంటున్న రోజుల్లోనే ఫ్రెండ్స్‌తో వెళ్ళేది. ఒక వేళ వద్దు అనుకుంటే ఇక్కడికిరా. కానీ నా సలహా మాత్రం వేరే ఊళ్ళు చూడు."

"సరే"

ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళేదారిలో ఇద్దరం నిశబ్దంగా ఉన్నాము. కారు పార్క్ చేసి నాతో లోపలికి వచ్చాడు. సెక్యూరిటీ చెక్ దగ్గర నిలబడి "ఇంకొంచెం సేపుందా?" అడిగాను.

"ఐదు నిమిషాలు ఆగి వెళ్ళు. మళ్ళీ లైన్ పెరగచ్చు."

రెండు నిమిషాలు నిశబ్దంగానే ఉన్నాము.

"ఆకలేస్తే లోపలికి వెళ్ళాక ఏమైనా కొనుక్కో" అన్నాడు.

"సరే"

"డబ్బులు కావాలంటే మెసేజ్ చెయ్యి."

"సరే."

"ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే ఫోన్ చెయ్యి"

భోరున ఏడ్చాను.

"కావాలంటే మళ్ళీ క్రిస్మస్‌కిరా. నెలకూడా లేదు" ఓదార్చాడు.

కొద్దిసేపయ్యాక, "ఫ్లైట్‌కి టైం అవుతుంది. వెళ్ళు. కావాలంటే గేట్ దగ్గరికి వెళ్ళాక ఫోన్ చెయ్యి."

"సరే."

ఏడుస్తూ, వెనక్కి తిరిగి అన్నయ్యని చూస్తూ లోపలికి వెళ్ళాను. బాత్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కున్నాను. కానీ ఏడుపు మాత్రం ఆగలేదు. కళ్ళు తుడుచుకుంటూ గేట్ దగ్గర కూర్చున్నాను. ఫ్లైట్‌లో గ్రూప్ వన్ వారిని ఎక్కమని అనౌన్స్ చేసినప్పుడు దాదాపు అందరూ నిలబడ్డారు. నాది గ్రూప్ త్రీ. అలా నిలబడిన వారిలో చాలామంది నా గ్రూప్. సీట్ నంబర్లు ఎలాగు బోర్డింగ్ పాస్‌లో ఉంది. మరి ఎందుకు అంతమంది నిలబడ్డారో నాకు తోచలేదు. నేను ఎయిర్ హోస్టెస్‌కి బోర్డింగ్ పాస్ చూపించి లోపలికి నడుస్తుండగా

"ఆర్ యూ ఓకే?" నా వెనక నిలబడ్డ ఆవిడ అడిగింది.

"యస్" అన్నాను.

"వజ్ ఇట్ యువర్ బ్రదర్?"

గేట్ దగ్గర నుండే నన్ను గమనించిందా అని ఆశ్చర్యపోయాను. నా ఏడుపుకి అందరూ నవ్వుకున్నారనుకుని "యస్" అని ముందుకి తిరిగి ఇయర్ ఫోన్స్ పెట్టుకున్నాను. విమానంలో కూడా బాగా దిగులుగా ఉన్నాను. విమానం దిగి వెన్నెలకి ఫోన్ చేసాను.

"బయటే ఉన్నాను. వచ్చేయ్" అంది.

ఎప్పటిలానే హనీష కూడా వెన్నెలతో వచ్చింది.

"ఎలా అయ్యింది?" అడిగారు.

"బానే అయ్యింది" బదులిచ్చాను.

"అలసిపోయావా?"

"లేదు."

"ఒకసారి ఇండియన్ స్టోర్‌కి వెళ్ళేసి ఇంటికెళదామా?"

"సరే."

"అభిజ్ఞ వాళ్ళు కొలరాడోకి వచ్చారట?" హనీష అడిగింది.

"అవును. ఒకరోజు కలిసాను వాళ్ళని."

"ఫోటో చూసాను. మీ అన్నయ్య కూడా వచ్చాడా?"

"ఓన్లీ డిన్నర్‌కి వచ్చాడు."

"మీ ఇద్దరి మొహాలు ఒకేలాగా ఉన్నాయి."

"ఔను. అందరూ నేను బాయ్ కట్ చేసుకుంటే అన్నయ్యలా ఉంటాను అని వెక్కిరించేవాళ్ళు"

"ఎప్పుడైనా చేసుకున్నావా?"

"ఛీఛీ లేదు"

ఇంతలో ఇండియన్ స్టోర్ వచ్చింది. నేను, హనీష అటూ ఇటూ నడుస్తూ కాలక్షేపం చేసాము. ఇంతలో ఒక జంట మా పక్కన నిలబడి కూరగాయలు కొంటున్నారు. బహుశా మేము ఉన్నామని గమనించలేదేమో "అబ్బా. వంకాయలు ఎంత తాజాగా ఉన్నాయి. తీసుకుందామా?" ఆవిడ అడిగింది.

"మొన్నే చేసావుగా. వద్దు" ఆమె భర్త అన్నాడు.

"పాలకూర ఎంత బావుందో తీసుకోనా?" అడిగింది.

"అక్కరలేదు. ఉన్నవి వండు ముందు"

"ఈ టమాటాల రంగు ఎంత బావుందో. తీసుకోనా?"

ఇంట్లో ఉన్నాయిగా ఇంకెన్ని కావాలి?"

ఇంతలో వెన్నెల వచ్చి "చెక్ అవుట్ చేస్తాను. అయిపోయింది" అని కౌంటరు దగ్గరికి వెళ్ళింది. ఆ జంట మా ఇద్దరిని చూసి నిదానంగా పక్కకి వెళ్ళారు.

నేను హనీష ఫక్కున నవ్వాము. జరిగిన సంగతిని కారులో వెన్నెలకి చెప్పాను.

"అయ్యో, పాపం ఫీల్ అయి ఉంటారు" అన్నయ్యలాగానే మాట్లాడింది. ఫ్లైట్‌లో ఎంత ఏడ్చానో, అంత పది నిమిషాలు నవ్వాను. దిగులు నెమ్మదిగా పోయింది. రూముకి వెళ్ళి ఒక్కదాన్ని ఉండడం ఇష్టపడక ఇవాళ మీ ఇంట్లో ఉండొచ్చా? అడిగాను.

"ఓ, సుబ్బరంగా" అన్నారు. దాంతో హాయిగా కబుర్లు చెప్పసాగాను. మర్నాటికి అంతా మామూలు అయిపోయింది. మధ్యాహ్నం గదికి వెళ్ళి కాసేపు చదువుకున్నాను. కొద్దిసేపు లాబ్‌కి వెళ్ళి రెయిన్‌తో మాట్లాడాను. మరుసటి రోజు నుండి క్లాసులు మొదలు. వారంలో ఫైనల్ ఎక్జామ్స్ మొదలు. అందరం చదువులో పడ్డాం. ఎక్జామ్స్ కి చదువుకునేప్పుడు అన్నయ్య ప్రొటిన్ బార్ తినమనడంతో వాల్‌మార్ట్‌లో కొన్ని కొనుక్కుని బాగ్‌లో పెట్టాను. వంటకి టైం వేస్ట్ అవుతుందని నేహ ఫ్రోజెన్ ఫుడ్ తినమనడంతో వంట మానేసాను. ఆకలేసినప్పుడల్లా వేడి చేసుకుని తినడం, లాబ్‌లో లేదా లైబ్రరీలో చదవడం, స్నో పడినప్పుడు మాత్రం గదిలో ఉన్నాను. లైబ్రరీలో అంతమందిని నేను ఇప్పటిదాకా చూడలేదు. అందరూ అక్కడే చదువుతున్నారు. చాలామంది ఇంట్లో బట్టలమీదే స్కార్ఫ్, జాకెట్ వేసుకుని వచ్చారు. ఇంత చలిలో అలాంటి బట్టలు ఎలా సరిపోతాయో నాకు అంతు పట్టలేదు. కొంతమంది లైబ్రరీలో గదులు బుక్ చేసుకుని మరీ చదువుకున్నారు. నా క్లాస్ మేట్స్ దాదాపు అందరూ అక్కడే రోజూ కనపడ్డారు. ఎగ్జామ్స్ పూర్తయ్యేసరికి లైబ్రరీలో జనాలు తగ్గిపోయారు. బుధవారంకి నా పరీక్షలు పూర్తైతే, నేహ వాళ్ళవి శుక్రవారం దాకా సాగాయి.

హాలీడేస్‌లో ప్లాన్స్ ఏంటి అని చర్చలు మొదలయ్యాయి. కేంపస్‌లో ఇదివరకు ఎంతమంది కనబడ్డారో, ఇప్పుడు అంత తక్కువ మంది కనబడుతున్నారు. చాలామంది ఇండియాకి వెళ్ళారు. నేను అన్నయ్య దగ్గరికి వెళ్తాను అని అందరూ అనుకున్నారట. ఫ్రెండ్స్‌తో ట్రిప్‌కి వెళ్ళమని అన్నయ్య అన్నది చెప్పాను. నాతో కలిపి మరో ముగ్గురికి ప్లాన్స్ లేవని తెలిసింది. ఎక్కడికి వెళదాం అని చర్చ మొదలైంది. మాకు పక్కనే షికాగో అని, అక్కడికైతే మూడు గంటల్లో వెళ్ళచ్చని ఒకరన్నారు. షికాగో బోర్ రెండు రోజులకన్నా ఉండలేమని మరొకరు అన్నారు. అలా ఒకదాని తరవాత ఒకటి అనుకుని, మొత్తాంకి లూయీవిల్, నాష్‌విల్, అట్లాంటాకి వెళ్దామని అనుకున్నాము. మా నలుగురిలో ఇద్దరికి డ్రైవింగ్ వచ్చు, ఒకరు డ్రైవింగ్ నేర్చుకుని అప్పుడే లైసెన్స్ తీసుకున్నారు. డ్రైవింగ్ రానిది నా ఒక్కదానికే కాబట్టి నా మీద జోకులు వేసారు.

రెంటల్ కార్ బుక్ చేస్తున్నామనగానే అన్నయ్యకి ఫోన్ చేసాను. ఎంతో భయపడుతూ, అదీ ఇదీ అంటూ కబుర్లు చెప్పాక హాలీడేస్ సంభాషణ వచ్చింది.

"టికెట్ బుక్ చెయ్యాలా?" అడిగాడు.

"అక్కర్లేదు ఫ్రెండ్స్‌తో వెళ్దామనుకుంటున్నాను" అన్నాను.

"ఎవరెవరు? ఎక్కడికి?" అడిగాడు.

అటు తిప్పి, ఇటు తిప్పి ఏదేదో చెప్పి ఆఖరికి నలుగురం వెళ్దామనుకుంటున్నామని చెప్పాను.

"ఎవరెవరు?" అనుకున్నట్లుగానే అడిగాడు.

"నేను, ఒకమ్మాయి, ఇద్దరబ్బాయిలు" భయపడుతూ చెప్పాను.

"నీ క్లాస్‌మేట్సా?"

"ఫ్రెండ్స్. వేరే డిపార్ట్‌మెంట్."

"ఎలా వెళతారు?"

"డ్రైవ్."

డ్రైవా? అదీ వింటర్‌లో? చాలా డేంజరస్. స్నోలో డ్రైవ్ కష్టం."

"వీళ్ళకి అలవాటే, మామూలుగా వెళుతూనే ఉంటారట. ఇక్కడ కూడా చాలా డ్రైవ్ చేస్తారు.."

మొత్తానికి అన్నయ్య చెప్పిన ప్రతి జాగ్రత్తని పాటిస్తానని, రోజూ ఫోన్‌లో మాట్లాడతానని, ఇబ్బంది కలిగితే వెంటనే అన్నయ్యకి ఫోన్ చేస్తా అని మాటిచ్చాను.

"అయితే నేను వెళ్ళొచ్చా?" అడిగాను.

"జాగ్రత్త. చాలా కేర్‌ఫుల్‌గా ఉంటానంటేనే వెళ్ళు."

"కేర్‌ఫుల్‌గానే ఉంటాను."

"నీతో వచ్చేవాళ్ళ నంబర్స్ అన్నీ నాకు పంపించు."

"పంపిస్తాను ఇవాళే."

"ఎంజాయ్."

"అంతేనా?"

"హేవ్ ఫన్."

"కోపం వచ్చిందా?"

"లేదు."

"నిజంగా?"

"యా. ఏ? కోపంగా ఉన్నాననిపిస్తుందా?"

"అంటే ఇద్దరు అబ్బాయిలు వస్తున్నారుకదా. నువ్వు తిడతావనుకున్నాను."

"నీతో ఇంకో అమ్మాయి కూడా వస్తుందిగా?"

"ఆఁ వస్తుంది."

"అబ్బాయిలు నీ వయస్సు వారేగా?"

"దాదాపు అంతే."

"కష్టపడి ఇంత దూరం వచ్చి, అంత మంచి యూనివర్సిటీలో చదువుతున్నారంటే వాళ్ళు మంచివారే అయ్యుండాలి. అయినా వాళ్ళు చెడ్డవారైతే నీ గట్ ఫీలింగ్ ద్వారా నాకే అర్ధమయ్యేది. నువ్వు వాళ్ళని నమ్మి వెళ్తా అంటే నాకు అభ్యంతరం  లేదు."

"నిజంగానా?"

"వద్దు వెళ్ళకు అనేదాకా ఇదే ప్రశ్న అడుగుతావా?" నవ్వాడు.

"లేదు, అయితే వాళ్ళకి నేను పక్కా వస్తున్నా అని చెప్తాను."

"జాగ్రత్త. డిటెయిల్స్ నాకు మెసేజ్ చెయ్యి."

"చేస్తాను .. బై."

వెటనే వాళ్ళకి కారు బుక్ చెయ్యమని చెప్పాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story